నవతెలంగాణ

1

ఆదిలాబాద్

ఆదివారం | మార్చి 24, 2024 | www.navatelangana.com

బోథ్ ఏఎంసీ చైర్మన్‌ను సన్మానించిన గణేష్‌రెడ్డి

నవతెలంగాణ-తలమడుగు

బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిని శనివారం తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా నియమకం అయినందుకు శాలువాతో సన్మానించారు. జిల్లా తాజా రాజకీయ పరిస్థితులపైన చర్చించామని గోక గణేష్ రెడ్డి తెలిపారు. పార్టీల మార్పులు చేరికలు గురించి ప్రస్తవించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంటి పసుల, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజేశ్వర్, పోశెట్టి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వివేక్

నవతెలంగాణ-మందమర్రి

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మందమర్రి పెద్ద మసీదులో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే వివేక్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదుకు వెళ్లిన ఎమ్మెల్యేకు ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, సీనియర్ నాయకులు అజీజ్, ఇషాక్, గుడ్ల రమేష్, తిరుమల్, పాషా పాల్గొన్నారు.



కమలంలో కలవరం..!

- సోయంను తప్పించి..గోడం నగేష్‌కు టికెట్
- ఆశించి భంగపడిన నాయకుల్లో తీవ్ర అసంతృప్తి
- ఇటీవలి పార్లమెంటరీ పార్టీ సమావేశానికి దూరం
- ఎన్నికల్లో వారి సహకారంపై అనుమానాలు
- ఎన్నికల ముంగిట ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన

లోక్‌సభ ఎన్నికల ముంగిట కమలం పార్టీలో కలవరం మొదలైంది. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని.. ఆ పార్టీ అధిష్టానం బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు టికెట్ కేటాయించింది. దీంతో ఏండ్లుగా పార్టీలో ఉండి టికెట్ ఆశించిన పలువురు కీలక నాయకులు తీవ్ర నిరాశకు గురవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ జెండా మోసిన వారికి కాకుండా ఇతర పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి బీజేపీ అధిష్టానం ప్రాధాన్యం ఇవ్వడం పట్ల వారంతా అసంతృప్తికి గురవుతున్నారు. దీంతో రానున్న ఎన్నికల్లో నగేష్‌కు వారు మద్దతుగా ఉంటారా..? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉండంలో ఆ పార్టీ నిర్వహించిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పలువురు కీలక నాయకులు గైర్హాజరుకావడం ఇందుకు మరింత బలం చేకూరుస్తోంది. లోక్‌సభ ఎన్నికల ముంగిట నెలకొన్న పరిణామాలు ఆ పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.



ఇటీవల ఉమ్డంలో నిర్వహించిన పార్లమెంట్ స్థాయి సమావేశానికి హాజరుకాని కొందరు ముఖ్యనాయకులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గత లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంటు స్థానం కైవసం చేసుకున్న బీజేపీకి రానున్న ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఏకంగా నాలుగు సీట్లు గెలవడంతో ఎంపీ స్థానంలోనూ మరోసారి విజయం సాధించాలని భావిస్తోంది. కానీ ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ శ్రేణులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సోయం బాపురావుకు ఆ పార్టీ అధిష్టానం టికెట్ నిరాకరించింది. బీఆర్ఎస్ నుంచి ఇటీవలే బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు ఆ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించడంతో సోయం బాపురావు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తొలుత పార్టీ మారే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరగడంతో బీజేపీ అధిష్టానం బుజ్జగింపులకు దిగినట్లు తెలిసింది. కేంద్రంలో నామినేటెడ్ పదవి ఇస్తామని హామీనిచ్చినట్లు తెలిసింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాకపోవడంతో ఆయన అసంతృప్తికి గురవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోపక్క కాంగ్రెస్ అధిష్టానం ఆయన్ను పిలిచి మాట్లాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. నామినేషన్ల పర్వానికి సుమారు నెల రోజుల సమయం ఉండటంతో రానున్న రోజుల్లో ఎలాంటి రాజకీయ పరిణామాలైనా చోటుచేసుకునే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆ నేతలు సహకరిస్తారా..?

రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాజా ఎంపీ సోయం బాపురావుతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు సైతం ఆ పార్టీ టికెట్ ఆశించారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు, సినీ నటుడు అభినవ సర్దార్, శ్రీలేఖతో పాటు పలువురు నాయకులు టికెట్ ఆశించారు. వీరంతా ఎప్పటికప్పుడు అధిష్టానం ముఖ్యులను కలుస్తూ తమకే టికెట్ వస్తుందని ఎవరికి వారు గట్టి నమ్మకం పెట్టుకున్నారు. మరోపక్క రాజేష్‌బాబు కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రచారం సైతం నిర్వహించారు. కానీ బీజేపీ అధిష్టానం మాత్రం వీరిలో ఎవరికీ కాకుండా బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు టికెట్ కేటాయించింది. దీంతో వీరంతా తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆ పార్టీ నిర్వహించిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి వీరంతా గైర్హాజరుకావడం చర్చనీయాంశమైంది. నగేష్‌కు కాకుండా తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేస్తామని ఇది వరకే వీరు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిసింది. దీంతో ఆ పార్టీ అధిష్టానం తీరు పట్ల అసంతృప్తితో ఉన్న సదరు నాయకులు రానున్న ఎన్నికల్లో గోడం నగేష్‌కు సహకరిస్తారా లేదా అనేది అనుమానంగా మారింది. మరోపక్క ఒకరిద్దరు ఎమ్మెల్యేలు సైతం నగేష్ అభ్యర్థిత్వం పట్ల అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో నెలన్నర రోజుల్లో ఎన్నికలు జరిగే వేళ పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఎటు వైపు దారితీస్తాయోనని ఆ పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

కేసులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముఖ్యమైన కేసులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. శనివారం జిల్లా హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని పురోగతిని త్వరగా సాధించి కోర్టులలో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తులో సీసీటీవీల పరిశీలన, సెల్‌ఫోన్ ఆధారంగా నేరస్తులను పసిగట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నేరస్తులకు శిక్షలు పడేవిధంగా దర్యాప్తు కొనసాగించాలని సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు కేసులో దర్యాప్తును పూర్తి చేస్తూ కోర్టులను చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల నేరస్తులను కోర్టులలో హాజరు పరిచి రెండు నెలల లోపు దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. గాంజా కేసులలో ప్రత్యేకంగా కోర్టు నిర్దేశించిన విధానం ప్రకారం దర్యాప్తును కొనసాగించాలని సూచించారు. కేసులలో సెల్‌ఫోన్ ఆధారితంగా ఫొరెన్సీ లాబరేటరీ కారణంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకొని త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా వర్టికల్స్‌పై సమీక్ష నిర్వహించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్స్ బి సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్ జీవన్‌రెడ్డి, పి శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, సిఐలు కె.సత్యనారాయణ, అశోక్, డి సాయినాథ్, పి చంద్రశేఖర్, కె. ఫణీధర్, ఎస్సైలు పాల్గొన్నారు.

సీఎంఆర్ బియ్యం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-నిర్మల్

వానాకాలం(2023-24) కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) బియ్యాన్ని సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. నిర్ణీత గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని అందజేయాలని సూచించారు. మిల్లర్లు అధికారిక వింగ్స్ యాప్‌లో సీఎంఆర్ నమోదును వేగవంతం చేయాలన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నందిత, డిఎం శ్రీకళ, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలపై డీఈఓకు పీఆర్టీయూ వినతి



నవతెలంగాణ-నిర్మల్

ఉపాధ్యాయుల సమస్యలపై డీఈఓ రవీందర్‌రెడ్డికి శనివారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాటకారి సాయన్న, వి. రవిరాజ్ మాట్లాడుతూ సర్దుబాటు అనే పేరుతో ఉపాధ్యాయులను దూర ప్రాంతాలకు పంపుతున్నారన్నారు. వారిని తిరిగి అదే పాఠశాలలో పనిచేసేలా చూడాలన్నారు. అనేక మంది అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులు ఉన్నప్పటికీ స్కూల్ అసిస్టెంట్లకు చీఫ్ సూపరింటెండెంట్లుగా, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా నియమించారని తెలిపారు. వారిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రధానోపాధ్యాయులకు పరీక్షల నిర్వహణ అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాలోని మండలాలకు ప్రధానోపాధ్యాయులను ఎంఈఓలుగా సర్దుబాటు చేయడంతో వారికి పని భారం పెరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలకు విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు కృషి చేయాలన్నారు. వీటిపై డీఈఓ సానుకూలంగా స్పందించారని, త్వరలో సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ భామండ్ల శంకర్, నాయకులు అడప గణేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణను ఉద్యోగంలో వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వారం రోజులుగా గ్రేహౌండ్స్ సిబ్బందికి ఇచ్చిన ప్రత్యేక శిక్షణను ఉద్యోగంలో వినియోగించుకుని ముందుకు సాగాలని అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ అన్నారు. వారం రోజుల ప్రత్యేక శిక్షణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన పోలీసు సిబ్బంది నేర్చుకున్నటువంటి మెళకువలను విధులలో వినియోగించాలని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా కోసం ఈ ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలు, వెహికల్ చెకింగ్‌లో తీసుకోవలసిన మెళకువలు నేర్చుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టుల వద్ద డ్యూటీలు, వాహనాల ముమ్మర తనిఖీ, ఇతర పోలీస్ సంబంధిత విధుల నిర్వహణకు ఈ శిక్షణ ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ రాణాప్రతాప్, సీఐ సతీష్, ఆర్ఐ(అడ్మిన్) పెద్దన్న, గ్రేహౌండ్స్ ఆర్ఎస్ఐ సంజీవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

నవతెలంగాణ-బోథ్

దేశ స్వాతంత్రం కోసం పరాయి పీడనను ఎదిరించి దేశంలో రైతులను, కార్మికులను ఏకం చేయడానికి చిన్న వయసులో ఉరి కంభమెక్కిన యోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువత ముందుకు వెళ్లాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు గట్ల గంగాధర్, గోవర్దన్, దాసు, మేడ్పల్మ ప్రవీణ్, టీజీవీపీ నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, సంతోష్ పాల్గొన్నారు.

బీజేపీపై పోరాడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భగత్‌సింగ్ స్ఫూర్తితో బీజేపీపై పోరాడి దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 93వ వర్ధంతిని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అధ్యక్షతన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం, దేశంలో ప్రజాస్వామ్యం స్థాపన కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టిన భగత్‌సింగ్ ఆశయాలను బీజేపీ తుంగలో తొక్కుతోందన్నారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్షాలపై ఈడీ, సిబిఐ దాడులు చేయిస్తూ దేశంలో ప్రశ్నించే వారు లేకుండా చేయాలని బీజేపీ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. బీజేపీలో చేరిన అవినీతి పరులందరు కడిగిన ముత్యాలు అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బీజేపీ మీద ఒక్క కేసు ఉండదని తెలిపారు. దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతూ రాజకీయాల్లోకి మతాన్ని లాగి రాజకీయంగా లబ్దిపొందే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలపై భారాలు వేస్తూ నడ్డి విరుస్తున్నారన్నారు. మోడీ సర్కార్ హయాంలో కార్మికులకు కనీసవేతనాలు లేవని, కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చి కట్టుబానిసలను చేయడానికి పూనుకుంటోందని తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణకు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, కె.సునీత, అగ్గిమల్ల స్వామి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు తొడసం భీంరావు, పూసం సచిన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లంక రాఘవులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోవ శకుంతల, లంక జమున, మంజుల పాల్గొన్నారు.

అవకాశాలను ఉపయోగించుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగ అభ్యర్థులు తమకు లభించిన అవకాశాలను వినియోగించుకొని ఉద్యోగాలకు ఎంపిక కావాలని ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా ఎ.శ్రీనివాస్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నర్సింగ్‌రావు అన్నారు. శనివారం కళాశాలలో టీఎస్‌కేసీ (తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్) ఆధ్వర్యంలో టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) వారి సౌజన్యంతో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళలో ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకు, రిలయన్స్ జియో, 24/7 ఏఐ సంస్థలు పాల్గొన్నాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి తమకు కావాల్సిన అభ్యర్థులను కంపెనీ వారు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ ఈ ఉద్యోగాన్ని జీవితంలో మొదటి అడుగుగా భావించి తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ మరింత ఉన్నతమైన ఉద్యోగాలను చేజిక్కించుకోవాలని ఆకాంక్షించారు. ఈ జాబ్ డ్రైవ్‌లో మొత్తం 85 మంది పేర్లు నమోదు చేసుకోగా వారిలో 15 మంది ఎయిర్టెల్ సంస్థ, 8 మంది రిలయన్స్ జియో సంస్థ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. 24/7 ఏఐ సంస్థకు సంబంధించి ఆన్‌లైన్‌లో 40 మంది అభ్యర్థులు ఎగ్జామ్ రాశారని, వారి ఫలితాలు రావాల్సి ఉందన్నారు. నిరుద్యోగ యువత ఇలాంటి ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, అకాడమిక్ కోఆర్డినేటర్ కె.రఘునాథ్, టీఎస్‌కేసీ మెంటర్ ఎండి.ఇమ్రాన్ అలీ, టాస్క్ ప్రతినిధి సాయిలక్ష్మణ్, రిలయన్స్ జియో ప్రతినిధి రాకేష్, ఎయిర్టెల్ ప్రతినిధి భాగ్యశాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి పట్టుకొమ్మలని, పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కును ప్రకటించిందని, మొక్కవోని దీక్షతో ప్రతి కార్యకర్త కంకణబద్ధులై గెలుపుకు కృషి చేయాలన్నారు. పల్లెల్లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమంపై చర్చించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలే తప్ప సంక్షేమం లేదన్న విషయాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. ఎవరి గ్రామంలో వారు పార్టీ కోసం ప్రచారం చేయాలన్నారు. అవకాశవాదులు పార్టీని వీడినప్పటికి ఎలాంటి నష్టం లేదన్నారు. పార్టీ వదిలి వెళ్లిన వారిని మళ్లీ పార్టీకి తీసుకునేది లేదని స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ పార్లమెంట్ నియోజవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టుందని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీకి ప్రజలు ఓట్లు వేసినట్లు తెలిపారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని విశ్వశిస్తున్నారన్నారు. మనం చేయాల్సిందల్లా ప్రతి ఓటరును కలిసి కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గతంతో పోలిస్తే పార్టీ ఏం చేస్తుందో ప్రజలకు చెప్పాలన్నారు. కేవలం సోషల్ మీడియాలో వచ్చిన వాటిని నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. సంక్షేమం పథకాలు నేరుగా వస్తున్నాయా? అని అడగాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు తప్ప ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ఆరు గ్యారంటి పథకాలు అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, జెడ్పీటీసీ అజయ్, ఎంపీపీలు మల్లికార్జున్ యాదవ్, సౌందర్య, మోతీరాం, నాయకులు మార్సుకోల సరస్వతి, బుర్సు పోచయ్య, గంధం శ్రీనివాస్, ఇంతీయాజాలా, అబ్దుల్లా, అలీబిన్ మద్, రవి, సంజీవ్, హైమద్ పాల్గొన్నారు.

సహజ సిద్ధమైన రంగులతోనే హోలీ

నవతెలంగాణ-నిర్మల్

ప్రజలంతా సహజ సిద్ధమైన రంగులతోనే హోలీ పండుగను జరుపుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. కృత్రిమ రంగులను వాడితే అనేక రకాలైన చర్మ సంబంధ వ్యాధులకు గురవుతారని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో తయారు చేసిన సహజ సిద్ధ రంగులను, మోదుగ పూల పౌడరును అధికారులకు పంపిణీ చేశారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్ర కరపత్రాల విడుదల

నవతెలంగాణ-ఉట్నూర్

శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ దీక్షా పాదయాత్ర కరపత్రాలను శ్రీ దీక్ష గురు ప్రేమ్ సింగ్ మహరాజ్ అధ్వర్యంలో విడుదల చేశారు. నార్నూర్ మండలంలోని కొత్తపల్లి దీక్షా భూమి నుండి పోవరాగడ్ సేవా దళ్ యాత్ర వరకు పాదయాత్రగా వెళ్లడం జరుగుతుందని సుధాకర్ నాయక్ తెలిపారు. ఏప్రిల్ 8న పాదయాత్ర ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ గణేష్, రాథోడ్ గోపాల్, బానోత్ షేర్‌సింగ్, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT JANGOAN
I.P. NO. 1 OF 2022
IN
IA.NO.143/2024

పిటీషనర్ :
వడ్లకొండ వినయ్ కుమార్
...వాది
మరియు
అల్లాడి శివరామకృష్ణ & ఇతరులు
.....ప్రతివాదులు

NOTICE

R 7.Musuku Ravinder Reddy, S/o. Chinna Reddy, Aged: 28 yrs, Occ: Pvt. Em- ployee, R/o. H.No. 2-3, Sunkilla Village & Mandal, adilabad District.

పైన తెలిపిన ఇన్సాల్వెన్సీ పిటీషనర్, రెస్పాండెంట్ నెం. 7 మీపై ఐ.పి. దావా ఎ పైన తెలిపిన కోర్టు వారి సందు దాఖలు పరిచినారు. ఇట్టి దావాలో మీ హాజరు కొరకు ది. 25.04.2024న వాయిదా ఉన్నది. మీరు ఆ రోజున స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని ది.25.04.2024న ఉ.గం. 10.30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో//

బుర్రా సుధాకర్
న్యాయవాది,
హన్మకొండ.
cell.9866204858

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు

నవతెలంగాణ-జైనథ్

రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో శనివారం సాయంత్రం మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో సీఆర్పిఎఫ్ డీఎస్పీ రావత్, జైనథ్ సీఐ డి.సాయినాథ్, సీఆర్పిఎఫ్ సీఐ సూరజ్, జైనత్ ఎస్ఐ పురుషోత్తం, పోలీస్ సిబ్బంది కేంద్ర బలగాలతో కలిసి మండల కేంద్రంతో పాటు లక్ష్మీపూర్ గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సాయినాథ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, బెల్ట్ షాపులు నిర్వహించవద్దని సూచించారు. ఎన్నికలు సజావుగా జరగడానికి కవాతు నిర్వహించామని పేర్కొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. శనివారం కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ధరిత్రిని కాపాడుకోవడానికి నేడు గంటపాటు విద్యుత్ లైట్లు ఆర్పి



పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించకుంటే రాబోయే రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ జగ్‌రామ్ అంతర్వేది, అనిత, జోత్స్న ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువైంది : ఆర్టీసీ డీఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటర్ జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే బూత్ లెవల్‌లో సరి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.



మహనీయుల స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి



నిర్మల్ : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..

నవతెలంగాణ-నిర్మల్

భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతిని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సీపీఐఎం నిర్మల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయం లో భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు శనివారం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు డి.పోశెట్టి మాట్లాడారు. వీరిని 1931 మార్చి 23న నాటి బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. ప్రజల్లో విప్లవ స్ఫూర్తిని రగిలించి స్వతంత్ర సంగ్రామాన్ని విజయపంథావైపు నడిపిన అమరవీరులకు నివాళులర్పించడం అంటే వారు చూపిన బాటలో నడవడమేనని అన్నారు. ఏ అసమానతలు లేని భారత దేశాన్ని పునర్‌నిర్మాణం చేయడమే అన్నారు. దాని కోసం ఎంతటి త్యాగల కైనా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత స్థితిలో అందుకు అందరు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు సాయిరెడ్డి, మజీద్ పాల్గొన్నారు.

జీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో..

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో నూతన విద్యా విధానం 2020 రద్దుకై పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని జీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రవీందర్, నవీన్, ప్రభాస్, రాజేష్, ఆదిత్య, రాజ్, తిరుపతి, మల్లేష్, నవీన్ పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో..

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల విప్లవ స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తుందన్నారు. కార్యక్రమంలో నిర్మల్‌టౌన్ కన్వీనర్ ద్యావర్ శెట్టి రవీందర్, మైనారిటీ కన్వీనర్ సోఫీ మొహమ్మద్ ఇమ్రాన్, సోఫీ మొహమ్మద్ వహీద్, ఆప్ నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో...

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కట్ల రాజన్న మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతరం ప్రశ్నించకుండా మత్తులో ఉంచుతున్నారని అన్నారు. 2019వ సంవత్సరంలో బీజేపీ ప్రభుత్వం తమ ఎన్నికల వాగ్దానంలో ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు గడిచి మరోసారి ఎన్నికలకు సంసిద్ధమవుతున్న బీజేపీ యువకులకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, కె.లక్ష్మి, గంగామణి, కమల, కవిత, చిట్టి, రాజారామ్ శ్రావణ్, రాజు, శ్రీకాంత్, ఆశన్న పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : భగత్‌సింగ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం కేశవ్ అన్నారు. శనివారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన జీవిత చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాలలో చేర్చాలని డిమాండ్ చేశారు.



ఆదిలాబాద్‌లో..

టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో....

పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్టూడెంట్ ఫోరం టీఎస్ఎఫ్ సొసైటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులు కబీర్‌దాస్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత స్వతంత్రం కోసం నిరంతరంగా పోరాటం చేశారన్నారు. ఇప్పుడు విద్యార్థులు, యూత్ ఆందరు భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ ఆదర్శం తీసుకోవాలని ఆయన జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాలు చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దీపక్ అశిఫాల్, టీఎస్ఎఫ్ అధ్యక్షుడు బి.రాహుల్, ఉపాధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ఇఫ్తార్ ఖాన్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కమిటీ సభ్యులు రాకేష్, మమత, అనుసూయ, నిఖిత, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో...

దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రశ్నించే గొంతులపై ఉపచట్టాలను ప్రయోగిస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడవి గణేష్ అన్నారు. శనివారం భగత్‌సింగ్ 93వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవనంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశంలో బ్రిటీష్ సామ్రాజ్యవాద దోపిడి పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించారని అన్నారు. నేడు దేశంలో స్వదేశీ పాలకులే దేశ సంపదను కొద్దిమంది చేతుల్లో పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కన్వీనర్ డి.కళావతి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.దీపాలక్ష్మి, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి కే.దత్తాత్రి, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్రీకర్, మనీష్, నవదీప్ నితిన్, రితీక్, నిఖిత పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో...

దేశ స్వాతంత్ర్యం కోసం యుక్తవయసులో ఉరికంబాన్ని ముద్దాడిన సమరయోధులు భగత్ సింగ్ అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. శనివారం పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ భగత్‌సింగ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఆయన జీవిత చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాలలో చేర్చి ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని అన్నారు. భగత్ సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మెస్రం కేశవ్, రమేష్, నరేందర్, పృథ్వీ జగన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...

దేశంలో విద్య, వైద్యం, ఉపాధి అందరికీ అందుబాటులోకి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ అగ్గిమల్ల సాయిచరణ్ అన్నారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిచరణ్ మాట్లాడుతూ వారు దేశం కోసం ప్రాణాలు త్యాగం చేశారన్నారు. కానీ వారి ఆశయాలను నేటి పాలకులు తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యను పేదలకు అందకుండా చేస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యావిధానంతో పేదపిల్లలు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు విద్యను అందుబాటులోకి తేవడానికి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తన వంతు కృషి చేస్తుందని, అమరుల ఆశయాల అమలుకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి పూసం సచిన్, నాయకులు కోళ్లపాక సాయిరాం, రౌత్ కార్తీక్, డి.గణేష్, ఎం.నితేష్, ఆర్.సాయిల్, ఎం.శివ, ఎస్.కార్తీక్, అఖిల్ పాల్గొన్నారు.



నిర్మల్ : ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో..



ఆదిలాబాద్‌లో..

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిపథంలో నిలపాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు నాణ్యమైన విత్తనోత్పత్తి చేపట్టి దేశానికే సరఫరా చేసేవిధంగా ఎదగాలని, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిపథంలో నిలపాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం కేవీకేలో వివిధ పంటలలో ఆధునిక విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన విత్తన పరిశోధన, సాంకేతిక విభాగం సౌజన్యంతో నిర్వహించిన ఈ సదస్సుకు రైతులు పెద్దఎత్తున హాజరయ్యారు. శాస్త్రవేత్తలు పంటలలో చేపట్టే సస్యరక్షణ చర్యలు, నాణ్యమైన, స్వచ్ఛమైన విత్తనం ఉత్పత్తికి పాటించాల్సిన మెళకువలతోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఉత్పత్తులను ఎలా నిల్వ చేసుకోవాలి, ఎంతశాతం తేమ ఉండాలి, ఎంతమేర ద్రావణం పిచికారీ చేసి వాడుకోవాలనే అంశాలపై సవివరంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సరిపడా విత్తనాలను సరఫరా చేసేలా రైతులకు విత్తనోత్పత్తిపై శిక్షణ ఇవ్వడంతో పాటు అందులో పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పిస్తున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని రైతులందరూ విత్తనోత్పత్తిలో భాగస్వాములు కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి మనమంతా పాటుపడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రైతు సంక్షేమానికి మనమంతా పాటుపడాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేటి అన్వేష్ రెడ్డి నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ పార్లమెంట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అంతకుముందు రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న సుంకేటి అన్వేష్‌రెడ్డికి ఇటీవల సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు పార్టీ నాయకులతో బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్వేష్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళుతుందని అన్నారు. ఇందులో మనమంతా భాగస్వాములు కావాలని ప్రభుత్వం ద్వారా అందించే ప్రతి పథకాన్ని రైతులకు అందించేందుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన తాను ఎల్లప్పుడూ రైతులకు కావాల్సిన అవసరాలు తీరుస్తూనే వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ ముందుంటానని భరోసా ఇచ్చారు. ఇందులో రాష్ట్ర జిల్లా కిసాన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- అక్రమంగా నిల్వ ఉంచిన కలప స్వాధీనం



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో పలు కార్పెంటర్ల ఇండ్లల్లో శనివారం అటవీశాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. పలువురి ఇండ్లల్లో, గ్రామ సమీపంలోని ముళ్ల పొదల్లో అక్రమంగా నిర్వహించిన కలపను స్వాధీనం చేసుకున్నారు. కలప విలువ దాదాపుగా రూ.లక్ష వరకు ఉంటుందని అన్నారు. స్వాధీనం చేసుకున్న కలపను సిరికొండ అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిరిచెల్మ టైగర్ జోన్ అటవీ శాఖ అధికారి గణేష్ అన్నారు. ఎవరైనా టేకు కలప అక్రమంగా నిల్వ ఉంచిన, అక్రమ కలప వాడిన చట్టరీత్యా చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ దాడుల్లో డిప్యూటీ రేంజ్ అధికారి గిరయ్య ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు విఠల్, ప్రవళిక, బేస్ క్యాంపు సిబ్బంది జంగు, లేతు, అరవింద్, అర్జున్, నిరంజన్, మారుతి పాల్గొన్నారు.

సీటీఓను మర్యాదపూర్వకంగా కలిసిన మార్కెట్ కమిటీ చైర్మెన్



నవతెలంగాణ-బోథ్

జిల్లా వాణిజ్య పన్నుల అధికారి సీటీఓ ఎస్.మోహన్‌ను మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి శనివారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ మార్కెట్‌కు సంబంధించిన ఆర్థిక పన్నుల విషయంలో సహకరించి, మార్కెట్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని విన్నవించారు. స్పందించిన ఆయన తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

పదో తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-నిర్మల్

పదో తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని చాణక్య ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అన్నారు. కేంద్రాలలో తాగునీరు, అత్యసర మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పరీక్షల నిర్వహణలో ఎటువంటి కాపీయింగ్‌కి తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలని, భద్రతా సిబ్బందికి సూచించారు. పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్, ప్రింటింగ్ దుకాణాలను మూసివేయాలని సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భుక్తాపూర్‌టౌన్ 5 ఫీడర్‌లో మరమ్మత్తుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నమ్రత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలోని తాంసి బస్ స్టాండ్ ఏరియా, రైల్వే స్టేషన్ ఏరియా, భుక్తాపూర్, నీరటి వాడ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులందరూ ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ఈ నెలాఖరులోపు వంద శాతం పన్నులు వసూలు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ డివిజన్ రెవెన్యూ పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో పది అంశాల ఎజెండాపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు, మార్చి 31లోపు వందశాతం పన్నుల వసూలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత కారణంగా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పనిచేయకుండా ఉన్న బోర్ వెల్స్, చేతిపంపులకు మరమ్మత్తులు చేపట్టాలని అన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ప్రతీ గ్రామ పంచాయతీలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో కూలీలకు ఎండల తీవ్రత నుంచి రక్షణకు తాగునీటి సౌకర్యం, టెంట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు గ్రీన్‌షెడ్, నెట్స్ ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. జాబ్ కార్డ్ ఉన్న ప్రతీ ఒక్కరికీ ఖచ్చితంగా వంద రోజుల ఉపాధిని కల్పించాలని అన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన 40 రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ని ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రచారాలకు సంబంధించిన పోస్టర్లను, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అధికారులంతా సమయానుకూలంగా సక్రమంగా తమ విధుల్ని నిర్వహించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ గోవింద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సందీప్, తహసీల్దార్లు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.



మరమ్మతులు చేపట్టి రైతుల నిరసన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవటంతో రైతులే స్వయంగా జేసీబీ సాయంతో మరమ్మత్తులు చేపట్టి వినూత్న నిరసన తెలిపారు. శనివారం మండలంలోని మునిపెల్లిలో ఎస్ఆర్ఎస్పీ డి-16 కాలువకు సంబంధించి పార్‌పెల్లి శివారు నుంచి మునిపెల్లి వరకు ఉన్న ఉప కాలువ పిచ్చిమొక్కలు, చెత్త చెదారంతో నిండి సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యకు సంబంధించి గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ నిధులు లేవని సాకు చెప్పి



ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు వాపోయారు. వైఎస్ఆర్ పాలనలో వేసిన సిమెంట్ లైనింగ్ అంతాకూడ ఎక్కడిక్కడ చెడిపోయింది. ఆ తరువాత ఈ కాలువలకు ఏలాంటి నిధులు కేటాయించకపోగా, ఈ కాలువలు పట్టించుకునే నాదుడే లేడని తెలిపారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్తాయి నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు. ఈ వినూత్న నిరసనలో రైతులు మేదరి భూమేశ్, శ్రీనివాస్, సాయికృష్ణ, సాజిదుద్దీన్, మేడిపెల్లి ప్రవీణ్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | మార్చి 24, 2024 | www.navatelangana.com

మద్యం దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని మద్యం దుకాణాలపై శనివారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందం అకస్మికంగా దాడులు నిర్వహించింది. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) ఈఎస్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భరత్‌కుమార్‌లు పలు మద్యం దుకాణాలపై దాడులు నిర్వహించగా



పెట్రోల్‌పంపులోని ఒక మద్యం దుకాణంలో కల్తీ మద్యం స్వాధీనమైంది. 15 చీఫ్ లిక్కర్ మద్యం బాటిళ్ల (180 ఎంఎల్)లో నీళ్ల కలిపినట్లు అధికారుల తనిఖీలో బహిర్గతమైంది. ఈ మద్యం బాటిళ్లను స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి విచారించారు. అనంతరం వీటిని ఎక్సైజ్ కార్యాలయంలో అందించి టాస్క్‌ఫోర్స్ అధికారులు వెళ్లిపోయారు.

పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోళీ పండుగ విశిష్టతను శ్రీరాం సత్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు రసాయనాలు కలిపిన రంగులు వాడటం వల్ల శరీరానికి ఎలర్జీ అవకాశం ఉందన్నారు. అటువంటివి వాడకూడదని సూచించారు. ప్రకృతి సిద్ధమైన రంగులను హోలీలో వినియోగించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు.

వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారులు సర్వే చేసి ఎన్ని ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారో వారిందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ భూములలో మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న పంటలు వేశారని, అవి చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలు కురవడంతో చింతలమానేపల్లి, బెజ్జూర్, కౌటాల, దహెగాం, సిర్పూర్(టి) మండలాల్లో రైతులు పంట నష్టపోయారన్నారు. జిల్లాలో 9వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే ఎకరానికి రూ.20వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. రుణమాఫీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, జిల్లా నాయకులు గెడం టికానంద్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



నవతెలంగాణ-కెరమెరి

గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంపీపీ పెందూర్ మోతీరాం అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు ముగింపు సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. పోటీలను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రధానం చేశారు. కబడ్డీ పోటీల్లో 22 జట్లు పాల్గొనగా విజేతగా టీఎంకే 7 స్టార్ జట్టు గెలుపొందింది. ద్వితీయ స్థానంలో శ్రీ వెంకటేశ్వర(లక్మేట్‌పేట్) జట్టు నిలవగా, తృతీయ స్థానంలో ఆదివాసీనగర్ జట్టు నిలిచింది. ప్రథమ విజేతకు రూ.21000 ఎంపీపీ పెందూర్ మోతీరాం, తాలీమ్ ఖాన్ అందించారు. ద్వితీయ బహుమతి రూ.15000 నగదును ఆత్రం సక్కు, యూత్ ఫోర్స్ మండల అధ్యక్షుడు కుమురం భీంరావు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.7777 నగదును మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెందూ ఆనందరావు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు కోవ దేవరావు, ఎల్లప్ప, దండుగుల శ్రీనివాస్, పెందూర్ శ్రీనివాస్, నాయకులు సిడాం ధర్ము, భరత్, జగనాథ్, జావిథ్, రాంచంధర్ పాల్గొన్నారు.

అప్పారి వెంకటస్వామి జీవనశైలిని స్ఫూర్తిగా తీసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

టీఎస్‌యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి జీవనశైలిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకొని శనివారం కాగజ్‌నగర్ మండలంలోని బలగల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 1974లో సంఘం ఆవిర్భవించిన నాటి నుండి 25 ఏండ్ల పాటు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా ఆయన కొనసాగారని, 16 ఏండ్ల సర్వీసును తృణప్రాయంగా వదిలేసి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని తన పూర్తి జీవితాన్ని సంఘం బలోపేతానికి అంకితం చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే మనందరి బాధ్యతగా భావించి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గురుకులాల కో కన్వీనర్ నరేష్, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షులు మహిపాల్, సభ్యులు సుచిత్ర, సునీత, నయీం, గోపి, రవి పాల్గొన్నారు.

26న జంబుగా పండ్ల తోటల వేలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని జంబుగా ఉద్యాన నర్సరీలో గల పండ్ల తోటల ఫలాలను ఈ నెల 26న వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బు గుప్తా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సపోటా, మామిడి, నిమ్మ తోటల ఫలాలను 26న ఉదయం 11 గంటలకు జంబుగా తోటలో వేలం పాట ఉంటుందన్నారు. ఆసక్తి గల వ్యాపారస్తులు జంబుగా ఐటీడీఏ నర్సరీలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

కుష్టువ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని తెగాపూర్, గజ్జిగూడ, జైత్‌పూర్, గోయగావ్‌తో పాటు మండల కేంద్రంలోని హనుమాన్ మందిర్, మజీద్ ఏరియా, పోస్టాఫీసు ఏరియాల్లో శనివారం కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వేలు నిర్వహించి వివరాలను తెలుసుకున్నారు. స్పర్శలేని మచ్చలుంటే వెంటనే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు కృపావాని, కృష్ణకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం



చింతలమానేపల్లి



పెంచికల్‌పేట్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

పోషకాహారంతోనే ఆరోగ్యమని, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శంకరమ్మ అన్నారు. శనివారం మండలం లోని రణ్వెల్లి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శంకరమ్మ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీఓ అధ్యక్షురాలు రూప సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన, సీమంతాలు చేశారు. అనంతరం సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ గర్భిణులు చిరుధాన్యాలు, తమ పరిసరాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పిల్లలు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తలు, చిరుధాన్యాలు వాటి ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని దరోగపెల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని, తృణధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తినాలని వారికి సూచించారు. పిల్లలకు బాలమృతం, కోడిగుడ్డును అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలోని మర్థిడి, లంబడిగూడ, సలుగుపెల్లి గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన, శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణారెడ్డి హాజరై పిల్లల తల్లులకు పోషణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ప్రీస్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తలను తెలియజేశారు. చిరుధాన్యాలు వాడకం పోషక విలువల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణవేణి, సూపర్‌వైజర్ కరుణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు, తల్లులు, కిశోర బాలికలు, ఆశాలు పాల్గొన్నారు.



బెజ్జూర్

భగత్ సింగ్ స్ఫూర్తితో మతోన్మాదులపై పోరాడాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న డీవైఎఫ్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటమే భగత్ సింగ్‌కి ఇచ్చే నిజమైన నివాళని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ 93వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలం నేటి యువతను చాందస భావాల వైపుకు తీసుకెళ్తున్నారన్నారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటమే భగత్ సింగ్‌కి ఇచ్చే నిజమైన నివాళి అని యువత భగత్ సింగ్ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని లేదంటే మతోన్మాద శక్తులు చరిత్రనీ వక్రీకరించే అవకాశం ఉంటుందన్నారు. స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారితో పోరాటం చేస్తూనే మతోన్మాదం మీద పోరాటం చేశారని గుర్తు చేశారు. సామ్రాజ్యవాదులను, మతోన్మాదులను దేశం నుంచి తరిమికొట్టాలని భగత్ సింగ్ పిలుపునిచ్చారన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చించి యువతకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు కుశన రాజన్న, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా నాయకుడు వినోద, జయ, కుమారి పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని గోలేట్ టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్ర భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, రెబ్బెన మండల సహాయ కార్యదర్శి బి జగ్గయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయల నర్సయ్య, కాంట్రాక్ట్ కార్మిక బ్రాంచ్ కార్యదర్శి చెల్లూరు అశోక్, సహాయ కార్యదర్శి సాగర్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ మండల ప్రెసిడెంట్ జాడి సాయి, ఆర్గనైజింగ్ కార్యదర్శిలు చంద్రశేఖర్, ఎండి షకిల్, కోడి రమేష్, కోటి రామ్‌కిషన్ పాల్గొన్నారు

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో...

భగత్ సింగ్ 93వ వర్ధంతిని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ బ్రిటిష్ వారిని గడగడలాడించిన మహనీయుడు భగత్ సింగ్ అని కొనియాడారు. దేశానికి స్వాతంత్రం రావడంలో ఆయన చేసిన కృషి ఎంతో ఉందన్నారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్పించాలని కోరారు. భగత్ సింగ్ గురించి యువకులు ఎంతో తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చల్లారి కృష్ణ, సహాయ కార్యదర్శిలు చేపట్టి శివ, చేపట్టి తిరుపతి, మండల నాయకుడు చాపడి రవితేజ పాల్గొన్నారు.



రెబ్బెన: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సీపీఐ నాయకులు

డిమాండ్లు ఆమోదించకుంటే సమ్మె ఉధృతం

- లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు



కిషోర్‌బాబు దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ డిమాండ్లను ఎస్పీఎం యాజమాన్యం ఆమోదించని పక్షంలో సమ్మె మరింత ఉధృతం చేస్తామని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి. కిషోర్‌బాబు స్పష్టం చేశారు. గత 18 రోజులుగా సమ్మె చేస్తున్నా మిల్లు యాజమాన్యం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం అసోషియేషన్ కార్యాలయం ముందు ఆయన ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఇన్‌ఛార్జి జెడ్పీ ఛైర్మన్ కోనేరు కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్, సీపీఐ (ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు మాట్లాడుతూ మిల్లులో ఉత్పత్తి అయిన పేపర్‌ను రవాణా చేసే లారీల రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తే యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాయితీలు ఇచ్చి మిల్లును తెరిపిస్తే యాజమాన్యం మాత్రం స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తూ స్థానికులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. దూరప్రాంతాల నుండి ముడిసరుకు తీసుకువచ్చే లారీల డ్రైవర్లు, క్లీనర్లకు మిల్లులో కనీసం టీ, టిఫిన్ చేయడానికి కూడా క్యాంటీన్ సౌకర్యం కల్పించడం లేదన్నారు. మిల్లు యాజమాన్య వైఖరి ఇదే రీతిలో ఉంటే సమ్మె ఉధృతం చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లారీ అసోషియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖయ్యూం, ప్రధాన కార్యదర్శి మొయినొద్దీన్, కోశాధికారి రాజేందర్, సభ్యులు అహ్మద్ పాషా, శంకర్, ముబీన్, షారూఖ్ పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి మృతదేహం అడ ప్రాజెక్ట్‌లో లభ్యం

నవతెలంగాణ ఆసిఫాబాద్

ఈ నెల 19న తప్పిపోయిన వ్యక్తి మృతదేహం మండలంలోని అడ ప్రాజెక్టులో లభ్యమైంద సీఐ సతీష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లారం కంచరగూడ గ్రామానికి చెందిన బోయిన రాజ్ కుమార్(28) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడ. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో ఈ నెల 19న ఆటోలో బయటకు వెళ్లి ఆ ఆటోను అడ ప్రాజెక్ట్ వద్ద వదిలిపెట్టి ఎటో వెళ్ళాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో ప్రాజెక్టులో శనివారం శవం తేలుతూ కనిపించింది. మద్యం మత్తులో ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ప్రాథమికంగా నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీడీఓగా అల్బర్ట్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



ఎంపీడీఓగా పెద్దపుడి అల్బర్ట్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛలు అందించి స్వాగతం పలికి శాలువతో సన్మానించారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి ఉంటుందని, అధికారులు కూడా పూర్తి సహకారం అందించాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు.

చేసిన తప్పుల పట్ల పశ్చాత్తాప పడాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవి.రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జీవితంలో చేసిన తప్పుల పట్ల ఖైదీలు పశ్చాత్తాపపడాలని, ప్రతిరోజు ధ్యానం చేస్తూ చెడు ఆలోచనలను రానివ్వకుండా సత్ప్రవర్తనతో దైవభక్తి కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవి.రమేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. క్షణికావేశంలో తెలిసో తెలియకో తప్పులు చేసి జైలులో ఉంటూ న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. జైలు సూపరింటెండెంట్‌కు వివరాలు తెలుపుతూ న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నేరం చేసిన వ్యక్తులపైన కాకుండా వారు చేసిన నేరంపైన కోపం రావాలని, చెడు ఆలోచనలు రానివ్వకుండా ప్రతిరోజు ధ్యానం చేస్తూ సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించారు. బ్రహ్మకుమారి ఆర్తి ఖైదీలకు మెడిటేషన్‌పై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అధికారులు డి.వెంకటేశ్వర్లు, ఎం.అంజనీదేవి, జైలు అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో డిమాండ్స్ డే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జర్నలిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ టీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం డిమాండ్స్ డే నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు రహమాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తుందన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రభుత్వ వైఖరిపై పోరాటం చేస్తామన్నారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో మీడియా పాత్ర వెలకట్టలేనిదని, అటువంటి మీడియాను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. డిమాండ్స్ డేకు బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, ఆసిఫాబాద్ ఎంపీపీ మల్లికార్జున్, సింగల్ విండో చైర్మన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు అలీబీన్ అహ్మద్, ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి ఆడప సతీష్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్‌గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు దేవునూరి రమేష్, బొజ్జ మహేష్ పాల్గొన్నారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-వాంకిడి

కులం పేరుతో దూషించిన కేసులో ముగ్గిరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసీ కేసు నమోదైంది. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి గెడం తారాబాయిని అదే గ్రామానికి చెందిన సయ్యద్, హైమద్, సాదిక్ ముగ్గురు కలిసి ఆమె ఇంటికి వెళ్లి కులం పేరుతో దూషించారు. అదే సమయంలో బాధితురాలు తారాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కును ప్రకటించిన తర్వాత మొదటిసారిగా జిల్లా కేంద్రానికి రావడంతో జెడ్పీటీసీ నాగేశ్వరరావు తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. కార్యకర్తలు ఆ దిశాగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, మాజీ సర్పంచులు భీమేష్, బాబురావు పాల్గొన్నారు.

స్నేహభావంతో ఆటల్లో ముందుకెళ్లాలి

నవతెలంగాణ జైనూర్

ప్రతి ఒక్కరూ స్నేహభావంతో క్రీడ ఆడి ప్రతి ఒక్కరూ తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసుకోవాలని ఎంపీపీ కొడప విమల ప్రకాష్ అన్నారు. శనివారం సిర్పూర్(యు) మండలంలోని సోయం గూడా గ్రామంలో క్రికెట్ పోటీల ముగింపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల మండలాలైన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలలో ఉన్న యువతకు ప్రత్యేక టోర్నమెంట్లు నిర్వహించి వారిలో ఉన్న నైపుణ్యానికి వెలికితీయడం ఎంతో గొప్ప పరిణామని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉంటున్న యువతులకు ఇలాంటి టోర్నమెంట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గిరిజన మండలాలలో ఇలాంటి క్రికెట్ పోటీలు నిర్వహించి వారికి ప్రోత్సహిస్తున్న గ్రామస్తులను అభినందించారు. అనంతరం సాయి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్లో మొదటి బహుమతి జైనూరు మండలానికి చెందిన మార్లవాయి గ్రామానికి రూ.20వేలు, ట్రాఫిని అందజేశారు. రెండవ బహుమతిగా జైనూర్ కేకే టీంకు రూ.పదివేల నగదుతో పాటు ట్రాఫిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టోర్నమెంట్ నిర్వాహకులు శంకర్, దేవావారి, పటేల్ పాల్గొన్నారు.

30వ వరకు పింఛన్ భట్వాడ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ద్వారా లబ్దిదారులకు అందించే ఆసరా పెన్షన్(వద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళ)ను ఈ నెల 30 వరకు భట్వాడ చేస్తామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పింఛనుదారులు తమ పింఛన్‌ను నేరుగా సంబంధిత తపాలా శాఖ నుండి పొందవచ్చని, దీనికి ఎటువంటి సొమ్ము చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. దళారీలను నమ్మవద్దని తెలిపారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీఓ రమేష్

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పలు గ్రామాలలో ఉన్న ప్రభుత్వ నర్సరీలను మండల పంచాయతీ అధికారి సింగిడి రమేష్ పరిశీలించారు. శనివారం ఆయన మండలంలోని కలమడుగు, ధర్మారం, లింగాయపల్లి గ్రామాలలో పర్యటించారు. అనంతరం ఆయా గ్రామాలలో ఉన్న నర్సరీలను, డంపింగ్ యార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో ప్రతి మొక్కకు నీరు పోసి కాపాడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మందమర్రి



మృతుడి కుటుంబానికి అమ్మ ఆదర్శం యూత్ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. శనివారం అమ్మ ఆదర్శం యూత్ వ్యవస్థాపకులు బండారి రవి ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన పేరాల శ్రీనివాస్ భార్యకు రూ.51000 నగదును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంతెన సుమన్, జిల్లా సెక్రటరీ సాతిని సంజీవ్, పెరుగు వెంకటేష్, సభ్యులు మద్ది రాయమల్లు, లింగంపల్లి శ్రీధర్, ముల్కల్ల రమేష్ పాల్గొన్నారు.

మంచిర్యాలలో జర్నలిస్టు డిమాండ్స్ డే



నవతెలంగాణ-నస్పూర్

జర్నలిస్టుల సంక్షేమాన్ని, మీడియా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ముందు టీయూడబ్ల్యూజే(ఐజేయు) మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డేగ సత్యం, పింగిళి సంపత్ రెడ్డి మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో జిల్లా జర్నలిస్ట్ డిమాండ్స్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన చేపట్టమని తెలిపారు. జర్నలిస్టులకు సంబంధించిన ప్రధానంగా మూడు డిమాండ్ల ను పరిష్కరించాలని పేర్కొన్నారు. మీడియా రంగంలో డిజిటల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన నేపథ్యంలో కొత్తగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల భద్రత, స్వేచ్ఛ కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఒక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న మీడియాకు అన్ని రాజకీయ పార్టీలు నాయకులు మద్దతు ఇవ్వలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయు కౌన్సిల్ మెంబర్ కాచం సతీష్, జర్నలిస్టులు ఎస్ రాజేశ్వర్, కే నారాయణ రెడ్డి, జనార్ధన్, కృష్ణ కిషోర్ శర్మ పాల్గొన్నారు.

గర్భిణుల సంక్షేమానికి కృషి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-హాజీపూర్



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంక్షేమానికి అధికారులు సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని వేంపల్లి, రాపల్లి-2, పడ్తనపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య మంచిర్యాల ప్రాజెక్టు సీడీపీఓ ఎ.విజయలక్ష్మితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహార పదార్థాల నాణ్యత, రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లల ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పిల్లలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రిలో నమోదు చేసుకోవడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ సమయానుసారంగా అవసరమైన పరీక్షలు చేయించుకునేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల బరువు, ఎత్తు, కొలతలు, మానసిక స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎదుగుదల తక్కువగా, అతి తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం, మందులను సకాలంలో అందిస్తూ మామూలు పిల్లల స్థితికి వచ్చే వరకు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన పిల్లల అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని పిల్లలచే అక్షరాలు దిద్దించారు. అన్నప్రాసన, శ్రీమంతం కార్యక్రమాలలో పాల్గొని, అందరిచే పోషణ పక్షం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పడనపల్లి గ్రామంలోని నర్సరీని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, హాజీపూర్ డీటీ హరితలతో కలిసి సందర్శించి రిజిస్టర్లు, మొక్కల సంరక్షణ చర్యలను పరిశీలించారు. వేసవికాలం అయినందున మొక్కలకు సకాలంలో నీటిని అందించాలని, ఎండ వేడి నుండి రక్షించేందుకు గ్రీన్మాట్లను ఏర్పాటు చేయాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి వార్డులను పరిశీలించి ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త బి.రజిత పాల్గొన్నారు.

అక్రమ ఇసుక డంపు గుర్తింపు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని షెట్‌పల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును గుర్తించినట్లు స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు. ఇసుక అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు శనివారం సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. పట్టుబడిన ఇసుక సుమారుగా 30 ట్రాక్టర్ ట్రిప్పులుగా నిర్ధారించి ఏడీ మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

పట్టుబడిన మట్టి లారీకి రూ.5 వేల జరిమాన

మండలం నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తు పోలీసులకు పట్టుబడిన లారీకి రూ.5 వేలు జరిమాన వేసినట్లు తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు గుర్తించి పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. పట్టుబడిన లారీకి రూ.5 వేల జరిమానా వేసి లారీని వదిలేసినట్లు ఆమె తెలిపారు.

మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డేగ బాపు

నవతెలంగాణ-హాజీపూర్

మాజీ సర్పంచులు సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా వేంపల్లి మాజీ సర్పంచ్ డేగ బాపు నియామకం అయ్యారు. తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య శనివారం నియామకం పత్రం అందజేశారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

● పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు



నవతెలంగాణ-హాజీపూర్

భగత్ సింగ్,రాజగురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యాలయంలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్ సభ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తలుగా అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి అజ్మీర లాల్ కుమార్, పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ మాట్లాడుతూ దేశంలో స్వదేశీ పాలకులే దేశ సంపదను కొద్దిమంది చేతుల్లో పెడుతున్నారని అన్నారు. నేడు దేశంలో ఫాసిజం పెరిగిపోయిందని, విద్యను మొత్తం కాషాయీకరించాలనే నేపథ్యంలో నూతన విద్యా విధానం 2020 తీసుకువచ్చారన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రశ్నించే గొంతులపై ఉప చట్టాలను ప్రయోగిస్తున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో నేడు సీఏఏ తీసుకు వచ్చారన్నారు. మోడీ మతోన్మాద, విద్యా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ ఉద్యమస్ఫూర్తితో పోరాటం చేయాలన్నారు. ఈ నెల 30 వరకు భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, నాయకులు సంధ్య, శ్రావణి, మహేష్, శివ పాల్గొన్నారు.

బ్రిటిష్ వారి క్షమాభిక్షతో బతికినోళ్లు దేశ భక్తులు కాదు

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-కాసిపేట

బ్రిటిష్ వారి క్షమాభిక్షతో బతికినవాళ్లు దేశ భక్తులు కారని, చిరు ప్రాయంలోనే ఉరికంబాన్ని ముద్దాడినవారు దేశ భక్తులని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సోమగుడెం(కే) ట్యాంక్ బస్తీలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి నివాసంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి నిర్వహించి, వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి అమరవీరులకు నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కనుకుల రాకేష్, మాజీ వార్డ్ సభ్యులు సపాట మల్లేష్, మాజీ కో ఆప్షన్ సంకే రాజ కుమారి, యూత్ నాయకులు ఎనగందుల వినోద్, భుక్య సాయి పున్నం, సంకే శ్రీనిత, సంకే లక్ష్మీ, సంకే లింగయ్య, మహేష్ పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని, సుందరయ్య నగర్ లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శనివారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుక్ దేవ్ ల 93వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ భగత్ సింగ్ గొప్ప దేశభక్తుడు, బ్రిటిష్ వలసవాద, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విరోచితంగా పోరాడుతూ, దేశ విముక్తి కోసం నవ్వుతూ ఉరికంభమెక్కిన మహనీయుడన్నారు. అసమాన స్వాతంత్ర్య పోరాట యోధుడైన భగత్ సింగ్, అతని సహచరులు రాజ్‌గురు, సుక్‌దేవ్‌లను 1931 మార్చ్ 23న నాటి బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. మతం వ్యక్తిగత అంశంగా ఉండాలి, అయితే అది రాజకీయాల్లో చొరబడి మతోన్మాద రూపం తీసుకున్నప్పుడు, దాన్ని ఒక పెద్ద శత్రువుని ఎదుర్కొన్నట్టుగానే ఎదుర్కోవాలి అని భగత్ సింగ్ చెబుతుండే వారన్నారు. మతం, మూఢనమ్మకాల బంధనాల నుండి ప్రజలు తామంతట తాము విముక్తి అంటుండేవాడు భగత్ సింగ్ అన్నారు. దేశ ప్రగతికి అంద విశ్వాసాలు మతమౌఢ్యము ఓ పెద్ద అడ్డంకిగా తయారయ్యాయని వారు సూచిస్తుండే వారన్నారు.



జన్నారంలో..

మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సరెండర్

నవతెలంగాణ-నస్పూర్

మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్య వైఖరి కారణంగా కలెక్టర్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీకి సరెండర్ చేయడం జరిగిందని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణంలోని మైనారిటీ గురుకులంలో ఇంటర్(ఎంపీసీ ద్వితీయ సంవత్సరం) చదువుతున్న వహీద అంజుం అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మరణించిందని, ఈ ఘనటకు సంబంధించి పూర్తి విచారణ అనంతరం మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ను సరెండర్ చేయడం జరిగిందని తెలిపారు.

నిర్ణీత గడువులోగా ఇంటి పన్ను వసూలు చేయాలి

● జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పంచాయతీల్లో ఇంటిపన్ను వాసూలు నిర్ణీత గడువులోగా వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం పంచాయతీ కార్యదర్శులకు, సాంకేతిక సహాయకులకు సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీలలో ముఖ్యంగా డ్రింకింగ్ వాటర్, పైపు లైన్ లీకేజిలు లేకుండా చూడాలని, అలాగే శానిటేషన్, సెగ్రిగేషన్ పట్ల నిరంతరం శ్రద్ధ వహిస్తూ పరిసర ప్రాంతాల్లో డ్రై వేస్ట్ రోజూ జరిగేలా, పిచ్చి మొక్కలు రోడ్లకు ఇరువైపులా లేకుండా చూడాలని అన్నారు. డ్రైన్ లను శుభ్రపరిచేలా సంబంధిత సఫాయి కూలిలచే చర్యలు తీసుకోవాలని అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రోజూ వారీగా డ్రై డే పాటించేలా, హరిత హరంలో భాగంగా మొక్కలకు నీరు పట్టేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సమయం లేదు నిర్ణీత గడువులో ఇంటి పన్ను వసూళ్ల సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోలీసుల ఆధ్వర్యం కళాజాతా

● పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పోలీసుల ఆధ్వర్యంలో డయల్ 100, షీటీమ్, సైబర్ క్రైమ్, ఆత్మహత్యలపై కళాబృందం ద్వారా శనివారం పట్టణంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రకుమార్ మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్న 100కు డయల్ కాల్ చేయాలని వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరించుతారన్నారు. అదే విధంగా విద్యార్థినులు కాలేజీ వచ్చి, పోయే సమయంలో ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే సమస్యను షీ టీమ్ పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ మధ్యకాలంలో ఆన్‌లైన్‌లో చాలా మంది నష్టపోతున్నారని, ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు అడిగిన మీకు మీ తల్లితండ్రులకు ఫోన్ చేసి మీకు లోన్ ఇస్తమని చెబితే నమ్మకూడదన్నారు. ఎలాంటి పని ఉన్న నేరుగా బ్యాంక్ వెళ్లి సమస్యను పరిష్కరించుకోవలన్నారు. ఇతరులు ఫోన్ చేసి మీకు ఓటిపి వచ్చింది చెప్పమంటే చెప్పకూడదన్నారు. అనంతరం కళజాతర బృందం నాటక రూపంలో, జానపద పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి


● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-హాజీపూర్

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం మండలంని ముల్కల్లలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను పాఠశాల ప్రిన్సిపల్ కె.మోహన్, హాజీపూర్ ఉప తహసీల్దార్ హరితతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంట శాల, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు గల ఆహారాన్ని మెను ప్రకారం సకాలంలో అందించాలని తెలిపారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున పూర్తి చేసిన సిలబస్‌ను మరొకసారి రివిజన్ చేయాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందుతున్న మెనూ, ఆహారం నాణ్యతపై విద్యార్థులను అడిగి వారితో కలిసి భోజనం చేశారు. వేసవికాలం విద్యార్థులు ఎలాంటి అస్వస్థతకు గురి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎవరైనా అస్వస్థతకు గురైనట్లయితే వెంటనే అవసరమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీ సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లోని పర్సనల్ డిపార్ట్మెంట్‌లో ఏసీ సౌకర్యం కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఇన్‌చార్జి జీఎం పురుషోత్తంరెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా మాట్లాడుతూ శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ పైన పర్సనల్ డిపార్ట్మెంట్‌ను రేకుల షెడ్డుతో నిర్మించడం వల్ల వేసవిదృష్ట ఎండలు తీవ్రతరం అయినందున అందులో పనిచేసే వారికి తీవ్రంగా ఇబ్బంది కలుగుతుందని, కాబట్టి వెంటనే పర్సనల్ డిపార్ట్మెంట్లో ఏసీ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు శ్రీధర్, శ్రీనివాస్, శశిధర్, కళ్యాణి, అఖిల పాల్గొన్నారు.

ధర్నా చేసిన మహిళలపై కేసు నమోదు

నవతెలంగాణ-జైపూర్

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున శుక్రవారం చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి మహిళలపై కేసు నమోదు చేసినట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవిందర్ తెలిపారు. ఎన్నికల కమీషన్ అనుమతి లేకుండా నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే క్యాపు కార్యాలయం ఎదుట ధర్నా చేయగా ఎఫ్ఎస్‌టీ టీం సభ్యుల ద్వార అందిన పిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద మద్దెల భవాని, శిరీష, ప్రసన్న, రుక్మిణి, సుజాత, మౌనిక, రేవతి, పద్మతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రూ.5లక్షల పూచికత్తుపై స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిదని పేర్కొంటూ ఎన్నికల నియమావళిని ఉల్లఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి అడుగడుగునా స్వాగతం

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా మొదటి సారి చెన్నూర్ నియోజకవర్గానికి బయలుదేరి వచ్చిన గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి ఇందారం మీదుగా శనివారం చెన్నూర్‌కు వెలుతుండగా ఇందారం, జైపూర్, భీమారంలో వంశీకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో వచ్చిన వంశీకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తూ శాలువాలతో సన్మానించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ విజయం కాయమని ఈ సంధర్భంగా ధీమా వ్యక్తం చేశారు. వంశీకృష్ణను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు మహ్మద్ ఫయాజోద్దీన్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు జైనోద్దీన్, నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, చల్ల విశ్వంబర్‌రెడ్డి, మండల పరిధి తాజా మాజీ సర్పంచులు లింగారెడ్డి, నామాల తిరుపతి, జక్కుల వెంకటేశం, సుంకరి శ్రీనివాస్, గోనె నర్సయ్య, పాపిరెడ్డి, ముదాం రమేష్, మంతెన లక్ష్మన్, శీలం వెంకటేశం, రిక్కుల లక్ష్మీనారాయణరెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్నం వెంకన్న తదితరులు ఉన్నారు.



రిటైర్డ్ కార్మికులకు రివైజ్డ్ పెన్షన్ పేమేంట్ ఆర్డర్ కాపీలు ఇవ్వాలి

జైపూర్ : సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు, ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు పంపిణీ చేయాలని సింగరేణి రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ రీజినల్ కమీషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సింగరేణి జీఎం పర్సనల్ (వెల్ఫేర్) 2023 జూలై 27న ప్రకటన జారీ చేసినట్లు గుర్తు చేశారు. ఈ మేరకు రిటైర్డ్ సింగరేణి కార్మికులు, ఉద్యోగులు వ్యయ ప్రయాసాలతో తమకు సంబంధించిన పూర్తి స్థాయి ధ్రువపత్రాలు, భార్యభర్తలు కలిసి దిగినటువంటి ఫోటోలతో సంబంధిత గని వెల్ఫేర్ సెక్షన్లలో కలువడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో గత ఆరు నెలలుగా రివైజ్డ్ పెన్షన్ కాపీల కోసం ఎదురు చూస్తుండగా సంబంధిత గని అధికారులు సీఎంపీఎఫ్ కార్యాలయాలకు సకాలంలో సమాచారం అందివ్వక జాప్యం చేస్తుండటం బాధాకరమని తెలిపారు.

రెండవ భార్య పెన్షన్ పొందేవిధంగా సీఎంపీఎఫ్ చట్టంలో సవరణ చేయాలి

కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం-1998 ప్రకారం కనీస పెన్షన్ రూ. 350 నుండి కనీస పెన్షన్ రూ. 1000లకు పెంచుతున్నట్లు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితుల్లో పెంచిన వెయ్యి రూపాయలు ఎమాత్రం సరిపోవని, కనీస పెన్షన్ రూ. 10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికుడు ఇద్దరు భార్యలను చట్ట పరంగా వివాహమాడితే రెండవ భార్యకు కూడా పెన్షన్ చెల్లించే విధంగా సీఎంపీఎఫ్ చట్టంలో సవరణ తీసుకురావాలని డిమాండ్ చేశారు. రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు రిటైర్డ్ కార్మికులకు, ఉద్యోగులకు పంపిణీ చేయాలని కోరారు.

నవతెలంగాణ

ఆదిలాబాద్

ఆదివారం | మార్చి 24, 2024 | www.navatelangana.com

భగత్ సింగ్‌కు ఘనమైన నివాళి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



భగత్ సింగ్ 93వ వర్ధంతిని శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆనాటి ముగ్గురు అమరులు చేసిన త్యాగం ఈ దేశ ప్రజలు మరువలేనిది అలాంటి పోరాటమే ఈ రోజు దేశంలో ఉన్న పాలక మతోన్మాద బీజేపీ ప్రభుత్వం పైన పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌల్, నక్క వెంకటస్వామి, వనం సత్యనారాయణ, కాదండీ సాంబయ్య, ఎగుడ మొండి, ఈరవెని రవి, మదాసు శంకర్, జంగపెల్లి సత్యనారయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అంతజేత

నవతెలంగాణ-జైపూర్



జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన మార్త బుచ్చయ్య తన తల్లి జ్ఞాపకార్థం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేశారు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి తరలివెళ్లిన బుచ్చయ్య అంగన్‌వాడీ కేంద్రంలో గల పిల్లల సౌకర్యార్థం 20 కుర్చీలు అందజేశారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం అవసరాల నిమిత్తం ఆఫీస్ టేబుల్లతో పాటు ఐదు కుర్చీలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు బుచ్చ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రివర్స్ తీస్తుండగా ప్రమాదం బాలుడి మృతి

నవతెలంగాణ-కడెం

కారు రివర్స్ తీస్తుండగా ప్రమాదం జరిగి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణాసాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కొత్తమద్ది పడగ గ్రామానికి చెందిన మోతె నర్సయ్య కుమారుడు మహర్షి(3) ఇంటి ముందు ఉన్నాడు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన సాదుల మహేష్(31) గత రెండు నెలలుగా ఆర్ఎంపీ డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సాదుల మహేష్ కారు నెంబర్ టీఎస్ 16యూడీ 3903 రివర్స్ తీస్తుండగా నర్సయ్య కుమారుడిపై ఎక్కించాడు. దీంతో మహర్షిపై అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడు తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎంపీపీ వాహనం తనిఖీ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఘన్‌పూర్ నుంచి ఉట్నూర్‌కు వెళ్తుండగా కొత్తగూడెం చెక్ పోస్ట్ వద్ద ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు వాహనాన్ని పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులో భాగంగా ప్రతి ఒక వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనదారులు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీస్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామంలో బంజారాల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్ రామారావు మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఆదిలాబాద్ జిల్లా సేవాలాల్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ శనివారం రూ.5వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెలో మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయం, విగ్రహాలు తప్పకుండా ఉండేలా ప్రతి తండా నాయక్, కారోబారి, సర్పంచ్, ఎంపీటీసీ నాయకులు, గ్రామ ప్రజలు తమ బాధ్యతలు తీసుకోని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయక్, కారోబారి గ్రామ ప్రజలు ఉన్నారు.

గాలికుంటు టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఉచిత గాలికుంటు టీకాలను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి పర్వీజ్ హైమాద్ అన్నారు. శనివారం మండలంలోని పిప్పిరి గ్రామంలో గోజాతి, గేదెజాతి పశువులకు ఉచిత గాలికుంటు టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తమ పశువులకు వేయించుకోవాలని లేనిపక్షంలో పశువులు ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి సోకి మరణించే ప్రమాదం ఉందన్నారు. పాలిచ్చే గేదెలకు, ఆవులకు గాలికుంటు వ్యాధి సోకినట్లయితే పాలు పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నారు. సూడి కట్టిన పశువులు గాలుకుంటి వ్యాధి సోకినట్లయితే కడుపులో దూడలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల రైతులు గాలికుంటు వ్యాధి సోకిన పశువును సకాలంలో గుర్తించి, మిగతా పశువులతో దూరంగా ఉంచాలని వెంటనే పశువైద్యశాలకు తోలుకువచ్చి వైద్యం చేయించాలని అన్నారు. ప్రస్తుతం గాలికుంటు వ్యాధిలో కాకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామని రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్

నవతెలంగాణ-ఖానాపూర్

మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలో ఎన్టీఆర్‌చౌక్ వద్ద భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో ఫాసిజం పెరిగిపోయిందని, ప్రశ్నించే గొంతులపై ఉపా చట్టాలను ప్రయోగిస్తున్నారని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో సీఏఏ తీసుకువచ్చారని అన్నారు. మోడీ మతోన్మాద, విద్యా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేయాలని అన్నారు. రైతంగంపై బీజేపీ ప్రభుత్వం కాల్పులను జరిపిందని, కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్, నాయకులు గోనె స్వామి, శేఖర్, కూడుదుల రాజేశ్వర్, శ్రీనివాస్, ఆకుల సత్తన్న, గుట్ల ప్రసాద్, రేకుల గంగన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కల్గవద్దు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో జరుగుతున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి పరీక్ష గదులు, సీసీటీవీ రూమ్, పరీక్ష కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వార్షిక పరీక్షల నిర్వహణ కొరకు 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి ముఖ్య పర్యవేక్షకులు, డిపార్ట్ మెంటల్ అధికారులు, సంరక్షకులు (కస్టోడియన్లు), ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షా కేంద్రం నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ సీటు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. శనివారం ఖానాపూర్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ అంటే సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించే పార్టీ అని అన్నారు. గతంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, భూపంపిణీ, ఉపాదిహామీ, తధితర అనేక ఫలాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. గ్రామాలు, మండలాలు, బూతుల వారిగా కార్యకర్తలంతా కలిసి సమీక్ష చేసుకోవాలన్నారు. ఏండ్ల నుంచి ఎన్నో ఒడుదొడుకులను ఓర్చుకొని పార్టీకోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ప్రజలతో మంచి సంబంధాలు కలిగిఉన్న ఇతర పార్టీల వారిని స్థానిక కార్యకర్తల సూచన మేరకే పార్టీలో చేర్చుకుంటామన్నారు. కొత్త, పాత అనే విభేదాలను పక్కన బెట్టాలని ఎంపీ స్థానం గెలుపుకోసం పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు బాగా వివరించాలని సూచించారు. కార్యకర్తల కోరిక మేరకు జిల్లాలో నామినేటేడ్ ద్వారా భర్తీ చేసే చైర్మెన్ పదవులను వీలైంత ఎక్కువ సంఖ్యలో భర్తీకోసం ముఖ్యమంత్రితో మాట్లాడుతానని తెలిపారు.

దేవుళ్ల పేరుతో రాజకీయం...

బీజేపీ దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తూ, ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని సీతక్క విమర్శించారు. దేవుడు ఒక్క బీజేపీ పార్టీకే సొంతం కాదని, అన్ని కులాలు, వర్గాలకు చెందినవాడు అనే విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. బీజేపీ కార్పొరేట్ సంస్థలకోసం పనిచేస్తే, కాంగ్రెస్ పేద ప్రజలకోసం పనిచేస్తుందన్నారు. కేంద్రం ప్రకటించిన పథకాలు ప్రజలకు అందుతున్నది శూన్యమని విమర్శించారు. గడిచిన పదేండ్లుగా నిరాధరణకు గురైన కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులకోసం తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.9కోట్లు నిధులు మాంజూరీ చేశామని తెలిపారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజలకు దగ్గరగా ఉండి పని చేయాలని సూచించారు. ఎన్నికల్లో కార్యకర్త పనితీరును బట్టే భవిష్యత్‌లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ మండల అధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, నాయకులు, యూసుఫ్ ఖాన్, కావలి సంతోష్, ఆయా మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల్‌లో సేవ్ డెమోక్రసీ డే

నవతెలంగాణ-నిర్మల్



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం ఆర్డీఓ కార్యాలయం ముందు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నందిరామయ్య, దుర్గం నూతన్ కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 14 నెలల ఢిల్లీ దిగ్బంధన రైతు ఉద్యమ విరమణ సందర్భంగా ఇచ్చిన రాతపూర్వక హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. పార్లమెంట్‌లో కనీస మద్దతు ధరల చట్టాన్ని చేయాలని అన్నారు. చనిపోయిన అమరవీరుల రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. దేశవ్యాప్త కార్మిక వర్గానికి కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని అన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగం ఇతర ప్రజా సంఘాలు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న, కానీ మోడీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్లకు దేశ వ్యవసాయ రంగాన్ని అప్పజెప్పడానికి కార్మిక చట్టాలన్నిటిని కార్పొరేట్లకు అనుకూలంగా మార్చడానికి పూనుకున్నదని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు జె.రాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎం.హరిత, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేందర్, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవా భోజన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య, నాయకులు కిరణ్, బర్యుంటా గంగారాం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా విస్తృతంగా పర్యటించారు. శనివారం మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రం, గోండ్ హర్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం, మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల, పోలింగ్ కేంద్రం, మండల ప్రజా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, పలు సూచనలు చేశారు. ముందుగా తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి, విద్యార్థుల హాజరు శాతాన్ని ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. మొత్తం విద్యార్థులు 280 ఉండగా అందులో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రతీ గదిని పరిశీలిస్తూ విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం గోండ్ హర్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల పెరుగుదల పర్యవేక్షణ చార్ట్‌లో ఉన్న వయసుకు తగ్గ బరువు ఏ వయసులో ఎంత ఉండాలి, ఆరోగ్యంగా ఉండే పిల్లలకు, అనారోగ్యంగా ఉండే పిల్లలకు, తల్లులకు సంబందించిన వివరాలను అంగన్‌వాడీ టిచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలో ఇస్తున్న పౌష్టికాహారంతో పాటు పిల్లలకు ప్రీ స్కూల్ కిట్ ద్వారా ఆటపాటలు నేర్పించాలని అన్నారు. రీడింగ్ రూమ్ ఖాళీగా ఉండటంతో అందులో గోండి భాషకు సంబంధించిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రం 118లో కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలని, ర్యాంపులు, అవసరమైన మరమ్మతులు చేయించుకోవాలని, పోలింగ్ కేంద్రంలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కవితారెడ్డిని ఆదేశించారు. తదుపరి గుడిహత్నూర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రిజిష్టర్‌లను పరిశీలించారు. ప్రతి గదిలో తిరుగుతూ మందులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీఓ, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోమాస శ్రీనివాస్ గెలుపుకు కృషి చేయాలి

నవతెలంగాణ-హాజీపూర్

పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలుపు కోసం సైనికుల్లా కృషి చేయాలని నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు పొట్టల నాగరాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నేతకానిలకు ప్రత్యేక గుర్తుంపు కోసం ఎంతో కృషి చేసిన వ్యక్తి గోమాస శ్రీనివాస్ అని అన్నారు. ఎస్సీలలో నేతకానిలకు గుర్తుంపులేక వెనుకబడి పోయారు అని గ్రహించి వారికి ప్రత్యేక గుర్తింపు తీస్కొని వచ్చి మన జాతికి ఎంతో సేవ చేశారని కోనియాడారు. ఆయన చేసిన సేవలను గుర్తించి జాతీయ పార్టీ అయిన భారతీయ జనత పార్టీ పెద్దపెల్లి ఎంపీ టిక్కెట్ ఇచ్చి నేతకాని సమాజాన్ని గుర్తించినందుకు బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకులకు ప్రత్యేక ధన్యవాదలు తెలియజేశారు. పెద్దపెల్లి పార్లమెంట్ పరిధిలో మెజార్టీ ఓటర్లగా నేతకానీలు ఉన్నారు కాబట్టి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. లేదంటే చట్ట సభల్లో మన గొంతుక లేకుండా పోతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభివృద్ధికి నిరంతరం కృషి చేసే వ్యక్తి గోమాస శ్రీనివాస్ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని సబ్బండా వర్గాల ప్రజలందరూ ఆదరించి భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నియోజకవర్గ యూత్ అధ్యక్షులు ఆకుదారి కుమార స్వామి, జైపూర్ యూత్ మండల అధ్యక్షులు సెగ్గం సంతోష్‌లు పాల్గొన్నారు.

గొడం నగేష్ గెలుపుకు కృషి చేయాలి

నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న గొడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్‌కే గార్డెన్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మోడీని మరోసారి ప్రధాన మంత్రి చేయడానికి ప్రతి కార్యకర్త కంకణ బదులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంటు విస్తారక్ సురేష్. జి.ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్‌వర్మ, కార్యదర్శి గాజుల దేవేందర్ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు బద్రి నాయక్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు బోడ తిరుపతి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బెడద గోపాల్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు దుర్గం మురళి, జిల్లా నాయకులు కొంతం శంకరయ్య, మధుసూదన్ రావు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

జాబ్‌కార్డ్ కలిగి ఉన్న ప్రతి కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్ లాల్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో క్షేత్ర స్థాయిలో పని ప్రదేశాల్లో కూలీలు నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ముందుగా మాస్టర్ రోల్‌ను పరిశీలించి, కూలీల వివరాలు సేకరించారు. జాబ్ కార్డ్ కలిగిన ప్రతి కూలీలకు ఉపాధి హామీ చట్టంలో వివిధ పనులు కల్పించాలని, ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. పనుల్లో తీసుకొనే జాగ్రత్తలను కూలీలకు వివరించారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఏపీఓ జాదవ్ సురేష్, ఈసీ సురేందర్, టీఏ బాపురావ్, పిల్డ్ అసిస్టెంట్ సంబాజీ, మెట్‌లు ఉన్నారు.

అక్రమ మద్యం పట్టివేత ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో అక్రమంగా బెల్టు షాపులను ఏర్పాటు చేసి, మద్యం అమ్ముతున్న పద్వాల్ ఇందల్ సింగ్‌తో పాటు మాడావి ఆనంద్‌రావ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.సునీల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించి, బెల్టు షాపులు మద్యం అమ్ముతున్నందున పోలీసులు దాడి చేసి వీరి వద్ద 21, 21 లీటర్ల మద్యం పట్టుకున్నామన్నారు. దీని విలువ రూ.9,0140 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది అఫ్సర్ పాల్గొన్నారు.

నేడు ప్రొఫెసర్ కోదండరామ్ నిర్మల్‌కు రాక

నవతెలంగాణ-నిర్మల్

నేడు ప్రొఫెసర్ కోదండరాం నిర్మల్ జిల్లా కేంద్రానికి వస్తున్నట్టు తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆరెపల్లి విజయ్ శనివారం తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు వస్తారని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ సమస్యలు, ప్రభుత్వ విధానాలు అనే అంశముపై సదస్సు ఉంటుందని అన్నారు. అనంతరం ఇఫ్తార్ విందు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛనర్లు, రైతులు, కార్మికులు, ప్రజలు పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు ఎంసీ. లింగన్న, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ వాజిద్ అహ్మద్ ఖాన్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-నిర్మల్

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పలువురు నిర్మల్ ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పార్టీలో చేరిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షులు కోరిపల్లి రామేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తితో పాటు పలువురు నాయకులు ఉన్నారు. వీరు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు కావడం, అలాగే ఇటీవలే బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం విశేషం.

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ పెంటాజీ

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని విటలేశ్వర్ ఆలయంలో శనివారం అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో నూతన ఆలయ కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో అన్ని కుల సంఘాల సభ్యులు కలిసి విటలేశ్వర్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ పెంటాజీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దీంతో 23మంది కార్యవర్గ సభ్యులు ఉన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, సభ్యులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఠాకూర్ హోటల్ ఆర్టీసీ బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బంది రోడ్డు భద్రతపై శనివారం అవగాహన కల్పించారు. వేసవి కాలంలో ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయాణికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థ ద్వారా కల్పిస్తున్న సేవలను వివరించారు. ఆర్టీసీ గమ్యం యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఆర్టీసీ ఎడీసీ లక్ష్మణ్, ఎస్టీఐ షేక్ యూసుఫ్, విలేజ్ బస్ ఆఫీసర్ సతీష్ ఉన్నారు.

టెట్ పరిక్ష ఫీజు తగ్గించాలి

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్

గతంతో పోల్చితే నాలుగింతలు పెంచిన టెట్ పరిక్ష ఫీజు తగ్గించాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విజ్ఞప్తి చేశారు. ఈ సంధర్భంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. 2024 టెట్ పరిక్ష ఫీజు విద్యాశాఖ భారీగా పెంచిందని గుర్తు చేస్తూ గత ప్రభుత్వంలో ఒక పేపర్ పరిక్ష ఫీజు రూ.200 ఉండగా ఇప్పుడు దానిని రూ. 1000 లకు పెంచారని లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో టెట్ పరిక్ష 2 పేపర్ల ఫీజు రూ.300 ఉండగా ఇప్పుడు దానిని రూ.2 వేలకు పెంచారని గుర్తు చేశారు. ఈ విధంగా టెట్ పరిక్ష ఫీజు పెంచడం సరికాదని, పెంచిన ఫీజు వెంటనే తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజులు పెంచడం ద్వార పేద మధ్య తరగతి అభ్యర్థులపై ఆర్థిక భారం పడుతుందని పేర్కొంటూ రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 11 జిల్లా కేంద్రాలో టెట్ పరిక్ష నిర్వహిస్తున్న ప్రకటించారని తెలిపారు. దీనివల్ల మిగితా జిల్లాల అభ్యర్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొవల్సివస్తుందని, దూర భారంతో పాటు ఆర్థికంగా భారం పడుతున్నందున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 33 జిల్లా కేంద్రాల్లో పరిక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొన్నారు. ఫలితంగా 7 లక్షల మంది నిరుద్యోగుల సమస్యను అర్థం చేసుకున్న వారమవుతామని ఆయన పేర్కొన్నారు.

పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను సన్మానించిన మంత్రి పొన్నం

నవతెలంగాణ-జైపూర్



కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువాతో సన్మానించారు. శనివారం హైదరాబాద్ నుండి చెన్నూర్ నియోజకవర్గానికి వస్తున్న వంశీకృష్ణను మార్గమధ్యంలో కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఉన్నారు.